## మైనరు బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితునికి
# 20 సంవత్సరాల జైలు,రూ.15వేలు జరిమాన

**విజయవాడ కార్పొరేషన్,జనవరి 6,ప్రభాతవార్త:** మైనరు బాలికపై లైంగికదాడికి పాల్పడినట్లుగా నమోదైన కేసులో నిందితుడైన రావూరి వెంకటేశ్వరరావుపై నేరం రుజువు కావడంతో అతనికి 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.15వేలు జరిమానాను విధిస్తూ, భాధిత బాలికకు రూ.5లక్షలు నష్టపరిహారం అందేలా చూడాలని డిస్ట్రిక్ట్ లీగల్‌సెల్ అథారిటీని ఆదేశిస్తూ మహిళా సెషన్స్ న్యాయమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి లోని వాంబే కాలనీ ఏరియాలో నివసిస్తున్న ఫిర్యాదికి ఇద్దరు కుమార్తెలు. 8 సంవత్సరాల వయస్సున్న చిన్న కుమార్తెను ఫిర్యాది తన తల్లి ఇంటి వద్ద ఉంచింది. తల్లి ఇంటి పక్కనే నివసిస్తున్న రావూరి వెంకటేశ్వరరావు 2019 మే 31వ తేదీ రాత్రి సమయంలో సదరు బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన్నట్లు సదరు ఘటనపై ఘర్షణ జరిగినట్లు చెప్పగా, ఈ క్రమంలో ఫిర్యాదికి గతంలో సదరు బాలిక ఇబ్బంది పడిన విషయం గుర్తుకు వచ్చి బాలికను విచారించగా గత కొద్ది రోజులుగా సదరు బాలికపైవెంకటేశ్వరరావు పలుమార్లు లైంగికదాడికి పాల్పడినట్లు,ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించినట్లు తెలిపింది. దానిపై తగిన చర్య తీసుకోవాలని ఇచ్చిన ఫిర్యాదుపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు నిందితునిపై కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చారు. అనంతరం ఛార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున ఎపిపి గెద్దం రాజేశ్వరరావు,వి.కృష్ణవేణిలు,ప్రస్తుత నార్త్ ఏసిపి డాక్టర్ కె.స్రవంతిరాయ్,అజిత్‌సింగ్‌నగర్ సిఐ వెంకటేశ్వరరావు,సిఎంఎస్ సిఐ జగదీశ్వరరావు, సిఎంఎస్ సిబ్బంది పర్యవేక్షణలో మొత్తం 12 మంది సాక్షులను విచారించగా నేరం రుజువుకావడంతో పై విధంగా జైలు శిక్ష, జరిమానాను విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

# వాయిలాలలో పొలం పిలుస్తోంది

**తిరువూరు, జనవరి 6, ప్రభాతవార్త :** తిరువూరు మండలం వావిలాల గ్రామంలో మండల వ్యవసాయ అధికారి పి.పద్మ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. / ఎకరానికి లేదా నాలుగు కిలోల బెన్ సల్ఫ్యూరాన్ మిథైల్ + ప్రెటిలాక్లోర్ 6.6 జి. గుళికలు 20 కిలోల ఇసుక కలిపి విత్తనం వెదచల్లిన లేదా డ్రమ్ సీడర్తో విత్తిన 37 రోజుల లోపల ఒక ఎకరం



నేరుగా విత్తిన వరిలో కలుపు యాజమాన్యం గురించి రైతులకు వివరించడం జరిగినది. పంట తొలి దశలో నీరు నిలగట్టక ఆరుతడిగా సాగు చేయడం వలన కలుపు సమస్య ఎక్కువ ఉంటుంది. అందువల్ల ఈ పద్ధతిలో కలుపు మందును తప్పనిసరిగా వాడాలని సూచించారు. దమ్ము చేసి నేరుగా విత్తిన వారిలో వాడదగిన కలుపు మందులు పైరజో సల్ఫ్యూరాన్ ఇథైల్ 10 పొడి మందు 100 గ్రా. / ఎకరానికి లేదా ప్రెటిలాక్లోర్ + సేఫ్నర్ 50 ఇ.సి. 600 మి.లీ. పొలంలో సమానంగా చల్లాలి. కలుపు మందుల పనితీరు బాగా ఉండాలంటే కలుపు మొక్కలు లేత దశలో ఉన్నప్పుడు పిచికారి చేయాలి. రైతు సోదరుల సరైన సమయంలో సిఫారసు చేసిన రసాయన కలుపు మందును ఎంపిక చేసుకొని నివారణ చర్యలు చేపట్టడం వల్ల వరిలో మేలైన దిగుబడులు సాధించవచ్చునని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, రైతులు, రైతు సేవా కేంద్ర సిబ్బంది, పశువైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ

**తిరువూరు, జనవరి 6, ప్రభాతవార్త :** తిరువూరు మండలం చిట్టెలలో మంగళవారం జరిగిన రెవిన్యూ గ్రామ సభలో సర్పంచ్ తుమ్మలపల్లి శ్రీనివాస రావు, ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ నాగమణి'లు రీసర్వే అనంతరం వచ్చిన పట్టాదార్ పాస్ పుస్తకాలు రైతులకు పంపిణీ చేశారు.



# కో-ఆపరేటివ్ సొసైటీ ఉద్యోగుల నిరాహారదీక్ష

**తిరువూరు, జనవరి 6, ప్రభాతవార్త :** కో-ఆపరేటివ్ సొసైటీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తిరువూరు కో-ఆపరేటివ్ బ్యాంకు దగ్గర జరుగుతున్న



నిరాహార దీక్షలో పాల్గొని ప్రసంగించిన సిఐటియు తిరుగూరు మండల నాయకత్వం ఎస్సీ భద్రం వెంకటేశ్వరరావు మంగళగిరి తిరుపతిరావు పాల్గొని మద్దతు తెలియజేశారు.

# ఎయిర్ బీఎన్బీ తాజా సర్వే వివరాల నివేదిక విడుదల

**విజయవాడ, జనవరి 6, ప్రభాతవార్త :** ఎయిర్ బీఎన్బీ ఆధ్వర్యంలో సంగీతం, యాత్రలు, ప్రదేశాలు అనే అంశాలపై తాజా సర్వే వివరాల నివేదిక మంగళవారం విడుదల చేశారని,ఎయిర్ బిఎన్ బి యొక్క రీజినల్ విభాగ హెడ్ అమన్‌ప్రీత్ సింగ్ బజాజ్ తెలిపారు. భారతీయ యువత తమ యాత్రా ఎంపికలను రూపొందించుకునే అత్యంత శక్తివంతమైన మార్గాలలో సంగీతం ఒకటిగా మారిందని . ఎయిర్ బిఎన్ బి యొక్క నూతన ఎక్స్పీరియన్స్ లెడ్ ట్రావెల్ ఇన్సైట్స్ నివేదిక వెల్లడించిందన్నారు.

# ఐపియం ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించిన డైరెక్టర్

**విజయవాడ జనవరి 6, ప్రభాతవార్త:** వైద్య ఆరోగ్యశాఖలో ఎంతో ప్రాధాన్యత కలిగిన ఐపీఎం డిపార్ట్ మెంట్ 2026 కాలమాని ని మంగళవారంతాడేపల్లిలోని ఏపీ శాక్ కార్యాలయంలో ఐపిఎం డైరెక్టర్. కె నీలకంతారెడ్డి. ఐఏఎస్ ఆవిష్కరించారు. కు పూర్వవైభవాన్ని తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తానని, అలాగే డిపార్ట్ మెంట్ లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించడానికి ప్రాధాన్యత నిస్తానని సంఘం నాయకులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి



ఆంధ్రప్రదేశ్ ఐపియం ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కె నీలకంతారెడ్డి మాట్లాడుతూ ఐపిఎం ద్వారా ప్రజలకు ఎంతో మెరుగైన సేవలు అందించడానికి డిపార్ట్ మెంట్ ఆర్.శ్రీనివాసులు, అసోసియేట్ ప్రెసిడెంట్ సప్పా శ్రీనివాస్, జయప్రకాష్, అఖిల్, శివకుమార్, భాస్కర్ రావు, అనిల్, ధనలక్ష్మి, వెంకట్రావు, రామకృష్ణ, సత్యనారాయణ, యోగేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ వార్త

# ఆవకాయ ఉత్సవాల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం
## సిపి రాజశేఖరబాబు

**విజయవాడ కార్పొరేషన్, జనవరి 6,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆవకాయ ఉత్సవాల నిర్వహణకు పకడ్బందీ భద్రతా



ఏర్పాట్లు చేయడం జరిగిందని, సిసి టీవీలు,డ్రోన్లు,కమాండ్ కంట్రోల్ రూం సేవలను ఉపయోగించుకోవడం జరుగుతుందని సిపి రాజశేఖరబాబు పేర్కొన్నారు. ఈ నెల 8 నుండి 10వ తేదీ వరకు మూడు రోజుల పాటు నగరంలో నిర్వహించనున్న ఆవకాయ్ సినిమా, సంస్కృతి,సాహిత్య అమరావతి ఉత్సవాలకు అన్ని శాఖలను సమన్వయం చేసుకొని పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సిపి రాజశేఖరబాబు,జిల్లా కలెక్టర్ లక్ష్మీషాలు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అన్ని శాఖల అధికారులకు ఏర్పాట్లను దిశా నిర్దేశం చేశారు. అధికారులు,సిబ్బంది క్షేత్రస్థాయిలో కార్యక్రమాల విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిసి టీవీలు,డ్రోన్లు,కమాండ్ కంట్రోల్ రూం సేవలను ఉపయోగించుకోవడం జరుగుతుందన్నారు. ట్రాఫిక్ పరంగా ఎక్కడా రద్దీ ఏర్పడకుండా తగు చర్యలు తీసుకోవడంతో పాటు పార్కింగ్ ప్రదేశాలను గుర్తించడం జరిగిందని,ఈ ఉత్సవాలు పర్యాటకులకు మధురానుభూతులను సొంతం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ లక్ష్మీషా మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరుగనున్న అమరావతోత్సవంల్లో పర్యాటకులకి పెద్దపీట ఉంటుందని, జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్ వంటి ప్రపంచ ప్రఖ్యాత ఉత్సవాల నిర్వహణలో విశేష అనుభవమున్న టీంవర్క్స్ సంస్థ బాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆవకాయ ఉత్సవాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతుందన్నారు పున్నమిఘాటతో పాటు భవానీ ద్వీపంలో సినిమా,సంస్కృతి,సాహిత్యాలకు సంబంధించి విన్నూత్న కార్యక్రమాలు జరుగనున్నాయని తెలిపారు. వీటిని దృష్టిలో ఉంచుకొని 20 సెక్టార్లకు సంబంధించి ఒకో సెక్టార్‌కు జిల్లా అధికారితో పాటు రెవిన్యూ, పోలీస్,విఎంసీలకు చెందిన అధికారులు, సిబ్బందితో బృందాలను ఏర్పాటు చేసామని, ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా సిబద్ధతతో విధులు నిర్వహించి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఇలక్కియా, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా తిరువూరు ఆర్టీసి డిపో గ్యారేజీలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు

**ఎ కొండూరు, జనవరి 6, ప్రభాతవార్త :** జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఎపిఎస్‌ఆర్‌టిసి ఎన్‌టిఆర్ జిల్లా వివరించారు. ఈ సందర్భంగా లెక్చరర్ ప్రసాదరావు మాట్లాడుతూ ముఖ్యంగా డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండెక్టర్లు విధి



తిరువూరు డిపో గ్యారేజీలో డిపో మేనేజర్ ఎ.సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ డిఎం జి.వి నాగమల్లేశ్వరరావుల ఆధ్వర్యంలో ఈ నెల 1 నుండి 31 వరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో మంగళవారం తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల జూనియర్ లెక్చరర్ ఇన్ లైబ్రెరరీ కెవిహెచ్ ప్రసాదరావు మంగళవారం చీఫ్‌గెస్ట్‌గా పాల్గొని డిపోలో ఆర్టీసి డ్రైవర్, కండెక్టర్లు కార్మికులకు రహదారి భద్రతా మాసోత్సవాల ప్రాముఖ్యతను నిర్వాహణలో డ్రైవర్లు మధ్యం సేవించి నడపరాదని అలాగే సెల్‌ఫోన్లు పొగతాగడం లాంటి వ్యసనాలకు దూరంగా ఉండి ఏకాగ్రతతో బస్సులు నడిపి ప్రయాణీకులను సురక్షితంగా గమ్యానికి చేర్చాలని ప్రసాదరావు సూచించారు. ముఖ్యంగా ఈ డిపోలో డ్రైవర్లు ఇంధనం ఆయిల్ పొదుపు అలాగే కండక్టర్లుఆ దాయం ఎక్కువగా వచ్చే విధంగా సంస్థ అభివృద్ధికి చేస్తున్న కృషిని లెక్చరర్ ప్రసాదరావు ప్రశంసించి సన్మానించారు.

# 450 మంది విద్యార్థులకు సాంకేతిక ధృవీకరణ పత్రాలు అందజేత

**అమరావతి, జనవరి 6, ప్రభాతవార్త :** తమ ఫ్లాగ్షిప్ స్కిల్లింగ్ కార్యక్రమం శామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ ద్వారా హైదరాబాద్‌లోని ఎన్ఎస్ఐసీ టెక్నికల్ సర్వీస్ సెంటర్ వద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కోడింగ్, ప్రోగ్రామింగ్ విభాగాల్లో 450 మంది విద్యార్థులకు ధృవీకరణ అందించామని శాంసంగ్ ఇండియా ప్రతినిధులు తెలిపారు. ఈ గ్లోబల్ స్కిల్లింగ్ కార్యక్రమంలో నిర్మాణాత్మక శిక్షణ, హ్యాండ్స్ ఆన్ లెర్నింగ్, ప్రాజెక్ట్ఆధారిత ఫలితాల ద్వారా యువతను పరిశ్రమకు అనుగుణమైన ఆధునిక సాంకేతికనైపుణ్యాలతో సన్నద్ధం చేసి యువత ఉపాధి అవకాశాలను పెంచుతుందన్నారు.

# కొల్లా జయశ్రీ కి జాతీయ స్థాయి స్వర్ణనంది ఎక్సలెన్స్ అవార్డు

**విజయవాడ, జనవరి 6, ప్రభాతవార్త :** కొల్లా జయశ్రీ అడ్వకేట్ మరియు సోషల్ ఆక్టివిస్ట్ నిరుపేదకు సమాజ సేవలో పేరుగాంచిన జయహో వర్కర్స్ క్లబ్ ఫౌండర్ జయశ్రీని ప్రజలకు ట్రాఫిక్ పై అవగాహన కల్పిస్తూ అనేక కార్యక్రమాలు, వేసవిశిభిరాలు ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ తదితర సామాజిక సేవలందిస్తున్న జయశ్రీకి ఈ అవార్డు అందించడం



జాతీయస్థాయి స్వర్ణనంది ఎక్సలెన్స్ అవార్డును మంగళవారం విజయవాడలో పలువురు సినీ ప్రముఖులు హాజరై అందించారు. నిరుపేదలకు న్యాయ సలహాలతో అన్ని రంగాల పాటు ముదావహమని సినీ ప్రముఖులు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని విజయాలు సాధించి, సేవలు మరింత విస్తృత పరచాలని కోరారు.

# పెద్దవడ్లపూడి గ్రామంలో ఎల్ఓసి చెక్కు పంపిణీ

**మంగళగిరి, జనవరి 6, ప్రభాతవార్త :** మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలో మంత్రి నారా లోకేష్ చొరవతో ఎల్ ఓ సి చెక్కును టిడిపి నాయకులు అందజేశారు. పెదవడ్లపూడి గ్రామానికి చెందిన సుంకర ఉమామహేశ్వరరావు కు రూ 10,00,000/ పది లక్షల రూపాయల చెక్కును, టిడిపి నాయకులు అందజేశారు. ఎల్ఓసి చెక్కు అందుకున్న లబ్ధిదారులు మంత్రి స్థానిక శాసనసభ్యులు నారా లోకేష్ కి ధన్యవాదాలు తెలియజేశారు. చెక్కు అందజేసిన వారి లో



మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, రూరల్ మండల పార్టీ అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు యేళ్ళ శివరామయ్య, మాదల రమేష్ బాబు, కనపాల సాగర్, గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు నడపన దుర్గారావు, చిట్టిబొమ్మ వెంకటేశ్వరావు, చింతల ఏడుకొండలు, మొద్దుకూరి రమేష్ బాబు, షేక్ బాజీ షైదా, పెనుముచి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# వాడని కేబుల్,ఇంటర్నెట్ ఇతర వైర్లను తొలగించాలి : సిపి సంజయ్‌రత్నకుమార్

**విజయవాడ కార్పొరేషన్,జనవరి 6,ప్రభాతవార్త:** పౌరుల భద్రతను ప్రాధాన్యంగా తీసుకుంటూ,నగర సుందరీకరణలో భాగంగా అవసరం లేని వాడని కేబుల్,ఇంటర్నెట్ లేదా ఇతర వైర్లు ప్రజల భద్రతకు ప్రమాదకరంగా ఉండే పరిస్థితి కనిపిస్తే వెంటనే తొలగించాలని చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పరిధిలో ఎక్కడైనా వేలాడుతూ ఇంటర్నెట్,కేబుల్ లేదా ఇతర వైర్లు ప్రజల భద్రతకు ప్రమాదకరంగా ఉంటే వాటిని వెంటనే తొలగించి అందంగా ఉండేలా పునర్నిర్మించుకుంటున్నామన్నారు. అవసరం లేని,వాడని వైర్లను క్రమబద్ధీకరిస్తున్నాం అని అన్నారు. పౌరులు,కేబుల్ ఆపరేటర్లు అందరూ ఈ విషయాన్ని గమనించి సమర్థవంతంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నగర సుందరీకరణలో భాగస్వాములు కావాలని కోరారు.

# 200కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి పనులు

**కంకిపాడు జనవరి6,ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం మొదటి రెండు సంవత్సరాలకాలంలో పెనమలూరు నియోజకవర్గంలో 200కోట్ల అభివృద్ధి పనులేలక్ష్యంగా పనిచేస్తున్నామని పెనమలూరు నియోజకరవర్గ శాశనసభ్యులు బోడేప్రసాద్



అన్నారు.మంగళవారం గోసాల గ్రామంలో 1కోటి12లక్షల నిధులతో చింతలకట్టరోడ్డు నూతననిర్మాణ శంఖుస్థాపనకు ముఖ్యఅతిథిగా విచ్చేసి పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ పనిచేస్తున్నామన్నారు. అమరావతి,పోలవరం నిర్మాణం అభివృద్ధి, యువతకు ఉద్యోగఅవకాశాలు,విజన్2047 ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రాన్ని దేశంలోనే గుర్తింపు పొందేలా కూటమిప్రభుత్వం కృషిచేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమినాయకులు,అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా భక్తిశ్రద్ధలతో రజ్జబ్ ఖీర్ పూరి న్యాజ్

**ఎ కొండూరు, జనవరి 6, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం





గొల్లపూడి గ్రామంలో టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఫైజాన్, సల్మాన్, యజ్దానిల ఆధ్వర్యంలో వారి పితృదేవులు ఎస్‌కె భాషా దివ్య ఆశీస్సులతో రజ్జబ్ నెల సందర్భంగా హాజరత్ సయ్యద్ ఇమామె జాఫర్ సాదిక్ (ర.అ) వారి ఖీర్, పూరి న్యాజ్‌ను అత్యంత భక్తి శ్రద్ధలతో సాంప్రదాయ బద్ధంగా ఘనంగా నిర్వహించారు. ఈ రజ్జబ్ న్యాజ్‌ను ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా తరలివచ్చిన భక్తులకు పెద్ద ఎత్తున ఖీర్‌పూరి ప్రసాదంతో పాటు అన్నదానం నిర్వహించారు. కొండపల్లి దర్గాకు చెందిన సూఫీ మహనీయుడు అల్తాఫ్ రజాబాబా అజ్మీర్ షరీఫ్ దర్గాకు చెందిన దర్గా పీఠాధిపతులు సయ్యద్ సుల్తానుల్ హసన్ చిష్టి మౌలానా బషీర్ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ నాయకుడు ఎండి వహేద్ టిడిపికి చెందిన పురప్రముఖులు పాల్గొనీ ఖీర్‌పూరి ప్రసాదాన్ని స్వీకరించి తరించారు. మహిళలు ఎక్కువ సంఖ్యలో రాగా వారు రజ్జబ్ న్యాజ్ చేసుకుని దువా జరిపారు.

# కృష్ణమాచారికి సత్కారం

**ఎ కొండూరు, జనవరి 6, ప్రభాతవార్త :** ఎ కొండూరు విశ్వబ్రాహ్మణ సంఘానికి నీలగిరి కృష్ణమాచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సంఘానికి అధ్యక్ష, కార్యవర్గ సభ్యులకు ఎ కొండూరు తిరువూరు శ్రీ మద్విరాట్ పోతులూరి



వీరబ్రహ్మేంద్ర స్వామి విశ్వబ్రాహ్మణ సేవా సంఘం వారు నీలగిరి కృష్ణమాచారిని సత్కరించి

# హైస్కూళ్లను సందర్శించిన జిల్లా డైట్ లెక్చరర్ బోసుబాబు

**ఎ కొండూరు, జనవరి 6, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలంలోని ఎ కొండూరు, రామచంద్రాపురం, చీమలపాడు గ్రామాల్లోని జడ్పీ సద్వినియోగం చేసుకొని 100శాతం ఫలితాలు సాధించాలని బోసుబాబు సూచించారు. అదేవిధంగా 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు ప్రభుత్వం అమలుపరిచే జిఎఫ్ఎల్ఎన్



హైస్కూళ్లను జిల్లా డైట్ కాలేజ్ లెక్చరర్ మిరియాల బోసుబాబు మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం 10వ తరగతి విద్యార్ధులకు అమలుపర్చిన 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను పరిశీలించి ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 9 గంటల వరకు అదే విధంగా సాయంత్రం 4 గంటల నుండి 5 గంటల వరకు జరిగే డైలీ అసెస్‌మెంట్‌ను శ్రద్ధగా ప్రోగ్రామ్‌లో భాగంగా అందరూ తెలుగు ఇంగ్లీష్‌లో చదవడం రావాలి, లెక్కల సబ్జెక్ట్‌లో చతుర్విధ ప్రక్రియలు కూడికలు తీసివేతలు గుణకారాలు భాగాహారాలు నేర్చుకోవాలని విద్యార్ధులందరికి తగు విధంగా కోరారు. మండలంలోని 3 హైస్కూళ్ల సందర్శనలో పనితీరు పట్ల డైట్ లెక్చరర్ మిరియాల బోసుబాబు సంతృప్తి వ్యక్తం చేశారు.

# అధునాతన పనితీరు, ఏఐ ఉత్పాదకతతో గెలాక్సీ బుక్ 6 సిరీస్

**విజయవాడ, జనవరి 6, ప్రభాతవార్త :** గెలాక్సీ బుక్ సిరీస్‌లో ఇవే అత్యంత అధునాతనమైన గెలాక్సీ బుక్ 6 అల్ట్రా, గెలాక్సీ బుక్ 6 ప్రో, గెలాక్సీ బుక్ 6లను సిఈఎస్ 2026 వేదికగా ఆవిష్కరించామని సన్నని డిజైన్, ఏఐ ఆధారిత శక్తివంతమైన పనితీరుతో శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ మొబైల్ ఎక్స్‌పీరియన్స్ బిజినెస్ ప్రెసిడెంట్ అండ్ సీఓఓ, ఆర్ అండ్ డి ఆఫీస్ హెడ్ వోన్‌జూన్ చోయ్ అన్నారు. గెలాక్సీ బుక్ 6 అల్ట్రా, గెలాక్సీ బుక్ 6 ప్రో. గెలాక్సీ బుక్ 6... గ్రే లేదా సిల్వర్ రంగులలో ఎంపిక చేసిన మార్కెట్లలో జనవరి 2026 చివరి నుండి అందుబాటులో ఉంటాయన్నారు.

# కాలిఫోర్నియా బాదంతో బరువు నియంత్రణ

**అమరావతి, జనవరి 6, ప్రభాతవార్త :** నూతన సంవత్సరం ప్రారంభం కాగానే, ఆరోగ్య లక్ష్యాలు ప్రధానాంశంగా మారతాయి. వీటిలో బరువు నియంత్రణకోసం కాలిఫోర్నియా బాదం మరింత చురుగ్గా పనిచేస్తుందని ఆల్మండ్ బోర్డ్ ఆఫ్ కాలిఫోర్నియా సహకారంతో యూగవ్ నిర్వహించిన తాజా సర్వే వెల్లడించినట్లు ఆహార నిపుణులు పేర్కొంటున్నారు. క్రమం తప్పని వ్యాయామంతో పాటు అల్పాహారంగా తీసుకుంటే రోజంతా నిరంతర శక్తిని అందిస్తాయని నిపుణులు వెల్లడించారు.

# పల్నాడు జిల్లా వార్త



## ప్రభుత్వాసుపత్రుల్లో పేదలకు కార్పొరేట్ వైద్యం: చీఫ్‌విప్ జీ.వీ

వినుకొండ,జనవరి6,ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా పని చేస్తుందని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు తెలిపారు. మంగళవారం శావల్యాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జీ.వీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటెండెన్స్ రికార్డ్,ఓపి రిజిస్టర్ పరిశీలించి వైద్యులు, సిబ్బందితో మాట్లాడి రోగులకు అందిస్తున్న సేవలు,వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆశాడే కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. జగన్ అరాచక పాలనలో ప్రభుత్వ వైద్యశాలల్లో తీవ్ర మందులుకొరత,మౌళిక సదుపాయాల కొరత,నిధుల దుర్వినియోగం పెద్ద ఎత్తున జరిగి పేదలకు మెరుగైన వైద్యం అందక తీవ్ర అవస్థలు పడ్డారని చెప్పారు. 18 నెలల కూటమి పాలనలో ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ హాస్పిటల్‌కు దీటుగా అభివృద్ధి చేశామన్నారు. అన్ని రకాల మందులు,వైద్య పరికరాలు,అనుభవం కలిగిన వైద్యుల నియామకాలు చేసి పేదలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. గుండె పోటు సమయంలో తీసుకోవలసిన ఎంతో విలువైన ఇంజక్షన్లు కూడా నేడు పీహెచ్‌సి,సీహెచ్‌సిల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. డీసీసీబీ ఛైర్మన్ మక్కెన,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## రాజముద్రతో పట్టాదారు పాస్‌పుస్తకాలు కొండంత అండ: జీ.వీ

వినుకొండ,జనవరి6,ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వే ప్రక్రియలో భాగంగా శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామంలో పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ,డీసీసీబీ ఛైర్మన్ మక్కెన హాజరయ్యారు. రీసర్వే పూర్తయిన రైతులకు,ప్రజల ఆస్తులకు సంబంధించి ప్రభుత్వ రాజముద్రతో కూడిన కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలను లబ్ధిదారులకు స్వయంగా పంపిణీ చేశారు. జీ.వీ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన రీసర్వే ద్వారా భూ వివాదాలు తొలగిపోయి రైతులకు తమ భూములపై పూర్తి హక్కులు లభిస్తాయని తెలిపారు. జగన్ హయాంలో ప్రజల ఆస్తులకు భద్రత లేకుండా చేశారని విమర్శించారు. ప్రభుత్వ రాజముద్రతో జారీ చేసిన ఈ పాస్ పుస్తకాలు రైతులకు కొండంత అండగా ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన,సొసైటీ ప్రెసిడెంట్ విశ్వనాధం,రెవిన్యూ అధికారులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## వల్లప్ప చెరువును పరిశీలించిన ఆర్డీవో మధులత

నరసరావుపేట, జనవరి 6 ప్రభాతవార్త :: బైపాస్ రోడ్ లోని వల్లపు చెరువును మంగళవారం ఆర్డిఓ మధులత పరిశీలించారు. తాహ సిల్దార్ వేణుగోపాల్ తో పాటు పట్టణ ప్రముఖులు కపలవాయి విజయ్ కుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. భీమలింగేశ్వర స్వామి, పార్వతి దేవి అమ్మవారు ల తెప్పోత్సవం చెరువులో ఈ నెల 14న నిర్వహించే సందర్భంగా ఏర్పాట్లును వారి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆర్డీవో పలు సూచనలు చేశారు. పెద్ద ఎత్తున కార్యక్రమానికి హాజరయ్యే భక్తులు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు సమస్యలు రాకుండా చూడాలని ఆదేశాలు ఇచ్చారు. సాంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాలని ఆర్డిఓ మధులత పేర్కొన్నారు. పట్టణ ప్రజలతో పాటు ఆలయ కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు కపలవాయి విజయ్ కుమార్ తెప్పోత్సవ కార్యక్రమ నిర్వహణకు ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమానికి పట్టణ,పరిసర ప్రాంతాల్లోని భక్తులు తిలకించే వేలాదిమంది అవకాశం ఉందని విజయకుమార్ తెలిపారు. ఆర్డీవో మధులత, తాసిల్దార్ వేణుగోపాల్, మున్సిపల్ అధికారులు తమ వంతు సహకారం అందిస్తున్నారని వారు వివరించారు. ఆదేవిధంగా వల్లపు చెరువు గంగా మహాలక్ష్మి తెప్పోత్సవ కమిటీ సభ్యులు కార్యక్రమ నిర్వహణకు చేయూతనిస్తున్నారని వారు వివరించారు.



### జిల్లా టిడిపి కార్యాలయ నిర్మాణానికి స్థలపరిశీలన

నరసరావుపేట, జనవరి 6 ప్రభాతవార్త :: నరసరావుపేటలో తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయ నిర్మాణానికి స్థల పరిశీలన కార్యక్రమం బుధవారం జరిగింది. పార్టీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య తో కలిసి జిల్లా అధ్యక్షులు షేక్ జాన్ సైదా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో, రాష్ట్ర యువ మంత్రి, నాయకులు నారా లోకేష్ సూచన మేరకు పార్టీ కార్యాలయ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు కొల్లి బ్రహ్మయ్య తెలిపారు. శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు నాయకత్వంలో పార్టీ కార్యాలయానికి భూమిని గుర్తించే కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలోని ఎం.పీ కృష్ణదేవరాయలుతో పాటు ఎమ్మెల్యేలు సూచనలతో జిల్లా కార్యాలయ నిర్మాణం పై ముందుకు వెళతామన్నారు. గతంలోనూ వివిధ ప్రాంతాల్లో అనుకూలమైన స్థలాన్ని గుర్తించే కార్యక్రమం జరిగిందన్నారు. అన్న ఎన్టీఆర్ చేతుల మీదగా స్థాపించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్రంతో పాటు దేశంలోనూ రాజకీయాలలో ఒక సంచలనం అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వంటి సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుడు ఆలోచనలు అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే విధంగా తెలుగుదేశం పార్టీ ముందుకు పోతుందన్నారు. రాజకీయాలలో అధికారం ఉన్న లేకపోయినా ప్రజల పక్షాన నిలిచి గెలుపోటములు సమానంగా స్వీకరించి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పార్టీ శ్రామికులతో పని చేస్తున్నదన్నారు. అటువంటి పార్టీకి జిల్లా కేంద్రంలోనూ అవసరమైన ఒక వేదిక గా పార్టీ కార్యాలయాన్ని నిర్మిస్తామని సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య వివరించారు. కార్యక్రమంలో పార్టీ లోని వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.



## ఎన్‌సిసి క్యాడెట్ల విరాళం

రొంపిచర్ల,జనవరి 6 ప్రభాతవార్త : స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ (ఎన్ఈసి)కళాశాల 05 కాయ్ ఎన్‌సిసి విభాగానికి చెందిన క్యాడెట్లు సైనిక కుటుంబాల సంక్షేమం కోసం స్వచ్ఛందంగా రూ. 30,181 సేకరించారు. ఈ మొత్తాన్ని జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా చేతుల మీదుగా జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి సుశీలకి అందజేశారు. జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా మాట్లాడుతూ దేశ రక్షణలో సేవలందిస్తున్న సైనికుల కుటుంబాల పట్ల ఎన్‌సిసి క్యాడెట్లు చూపుతున్న సేవాభావం అభినందనీయమని కొనియాడారు. యువతలో దేశభక్తి, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఎన్‌సిసి కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు, ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ మెడికొండ రాజేష్ బాబులు క్యాడెట్ల సేవాభావాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీనియర్ కాడేట్లు సిహెచ్.. మణి కుమార్, పి. గీతా, ఎన్. సాహిత్య రెడ్డి, బి. కిషోర్ బాబు, కే. గురు సాయి, పి. లిఖిత నందిని, డి. సమీరా, డి. కావ్యశ్రీ లు పాల్గొన్నారు.



## కేజీబీవీలో నాన్‌టీచింగ్ పోస్టులకు నియామకాలు

నరసరావుపేట,జనవరి 6 ప్రభాతవార్త :: పల్నాడు జిల్లాలోని కేజీబీవీ లలో నాన్ టీచింగ్ పోస్టులలో నియామకాలకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. ఆయా పాఠశాలలో టైప్ 3, మరియు టైపు 4 కోసం నాన్ టీచింగ్ రిక్రూట్మెంట్ 202 కు సంబంధించి ఆన్లైన్ ఓపెన్ చేయడం జరిగిందన్నారు. నోటిఫికేషన్ కామా వేకెన్సీ లు,రోస్టర్ మరియు అప్లికేషన్ ఫామ్ కోసం https://samagrashikshapalnadu.blogspot.com సందర్శించాలని అధికారులు సూచించారు. 2026 జనవరి 11 తేదీలోపు ఆయా పోస్టులకు సంబంధించి దరఖాస్తులు అందజేయాలన్నారు. నరసరావుపేటలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు సమగ్ర శిక్ష కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందని జిల్లా అధికారులు సూచించారు.

## వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు



నరసరావుపేట, జనవరి 6 ప్రభాతవార్త : స్థానిక చిలకలూరిపేట రోడ్డులో గల అమ్మా నాన్నల ప్రేమాలయం వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాను నిర్వహించారు. మంగళవారం యస్.యస్.యన్ కళాశాల పాలకవర్గ అధ్యక్షులు మరియు ఆంధ్రప్రదేశ్ బులియన్ మర్చంట్స్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ కపలవాయి విజయకుమార్ గారి 72వ జన్మదిన వేడుకలను "ది టౌన్ వైడ్ సూపర్ స్టార్ కృష్ణ మహేష్ బాబు యువశక్తి పట్టణ అధ్యక్షులు ఫారూఖ్ బాబు ఆధ్వర్యంలో నిర్వ హించారు. కపలవాయి విజయకుమార్ పాల్గొని తన పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటుచేసిన కేక్ కట్ చేసి వృద్ధులకు మిఠాయిలు పంచి పెట్టారు. వృద్ధాశ్రమంలోని వారికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హీరో కృష్ణమహేష్ బాబు అభిమానులు యండి. షంషీర్ అలీ,షేక్. నాగుర్ వలి,మన్నే పల్లి శ్రీను, నాగేశ్వరరావు, కె.రమేష్ బాబు, ఆశ్రమ నిర్వాహకులు ధనుంజయ్ పాల్గొన్నారు.

## కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

### మహాశివరాత్రి రోజున వచ్చే భక్తుల ఏర్పాట్లపై ఆదేశాలు

నరసరావుపేట, జనవరి 6 ప్రభాతవార్త ::ఈ ఎడాది 2026 ఫిబ్రవరి 15 తేదీన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లు జిల్లా అధికారులు సమన్వయంతో పని చేసి తిరునాళ్లను విజయ వంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, ఎస్పీ కృష్ణారావు ఆదేశాలు జారీ చేశారు. మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ లో జరుగుతున్న ఉత్సవాలలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పటిష్ట చర్యలు



చేపట్టాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం నరసరావుపేట కోటప్పకొండ తిరునాళ్ల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా మాట్లాడుతూ, ప్రభలు తరలింపుకు ఎటువంటి అంతరాయం కలగకుండా రోడ్లను తీర్చిదిద్దాలన్నారు. ప్రభల రాకపోకలకు విద్యుత్ వైర్లు తగలకుండా చర్యలు తీసుకోవాలి అన్నారు. పారిశుధ్య నిర్వహణ మరియు మంచినీటి సరఫరాను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎప్పటికప్పుడు వ్యర్థాలను తీసే విధంగా సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. క్యూలైన్లో ఉండే భక్తులకు మంచినీళ్ల ప్యాకెట్లు అందజేయాలని కోరారు. కొండ క్రింద నుండి కొండపై వరకు భక్తుల తరలింపుకు ఘాట్ రోడ్డుకు అనువైన అవసరమైన బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. 108 వాహనాలు, క్యూలైన్ల వద్ద, మెట్ల మార్గంలో, కొండపైన మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలనీ, అదనపు వాహన డ్రైవర్లు, మెకానికులు, భారీగా ఆర్టీసీ సిబ్బంది అందుబాటులో ఉంచాలని తెలిపారు. దేవాదాయ శాఖ అధికారులు అన్ని శాఖల అధికారులను సమన్వయ పరుచుకొని, అధికారు లందరితో కలిసి పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ, ప్రశాంత వాతావరణంలో తిరుణాళ్ళ నిర్వహించేందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆటోడ్రైవర్ల సంక్షేమానికి 'కూటమి' ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఎమ్మెల్యే డాక్టర్ 'చదలవాడ'

నరసరావుపేట, జనవరి 6, ప్రభాతవార్త: : ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. స్థానిక ఏపీఎస్ఆర్టీసీ వద్ద మంగళవారం నరసరావుపేట పట్టణంలో అంబేద్కర్ యువజన ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతనంగా ఆటో యూనియన్ పాయింటును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల జీవన భద్రత, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, సమాజ సేవలో కీలక పాత్ర పోషిస్తున్న డ్రైవర్లకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని చెప్పారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయాలతో ఏర్పడిన ఈ యూనియన్ పాయింట్ డ్రైవర్ల మధ్య ఐక్యతను, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. నరసరావుపేట నియోజకవర్గంలోని 1,422 మంది ఆటో డ్రైవర్లకు ఒక్కొక్కరికి రూ. 15,000/ చొప్పున, మొత్తం రూ. 21,33,000/ లను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా వారి ఖాతాల్లో జమ చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కొట్ట కిరణ్, వాసిరెడ్డి రవి, ఆటో యూనియన్ నాయకులు సయ్యద్. బాజీ, యూనియన్ ప్రతినిధులు, కూటమి నాయకులు, ఆటో డ్రైవర్స్ పాల్గొన్నారు.



## రైతులకు రాజముద్రలతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ: ఎమ్మెల్యే డాక్టర్ 'చదలవాడ'

నరసరావుపేట, జనవరి 6 ప్రభాతవార్త ::నరసరావుపేట మండలం జొన్నలగడ్డ రెవెన్యూ పరిధిలోని రంగారెడ్డి పాలెంగ్రామంలో మంగళవారం స్వచ్ఛ సంక్రాతి స్వచ్ఛ గ్రామ పంచాయితీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి అధ్యక్షత వహించారు. రైతులకు రాజముద్రలతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు షేక్. జాన్ సైదా, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొని రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా జాన్ సైదా మాట్లాడుతూ, రైతులకు అందజేసే ప్రతి పట్టాదారు పాస్‌పుస్తకం పూర్తిగా చట్టబద్ధంగా ఉండాలన్నారు. భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాల్సి న అవసరం ఉందన్నారు. రైతులు తమ పంట పొలాలను ఆస్తిగా కాకుండా రైతుకు అనుబంధంగా వాటిని భావిస్తూ ఉంటారని తెలిపారు. మన తాతలు, తండ్రులు సంపాదించిన ఆస్తులుపై జగన్ ఫోటోలు పెట్టుకోవడంపై రైతులు ఆందోళన చెందారని, తెలుగుదేశం పార్టీ అధికారంలో ఒక రాగానే రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ గతంలో పట్టదారు పాసు పుస్తకాలపై జగన్ ఫోటో పెట్టడంతో రైతులు ఆందోళన చెందరన్నారు. రాష్టంలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే రైతులకు రాజముద్ర కలిగిన పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణి చేస్తున్నట్లు చెప్పారు. తెలుగుదేశం పార్టీ ఎప్పటికీ రైతుల పక్షానే నిలబడుతుందన్నారు. ప్రతి రైతుకూ స్పష్టమైన భూ రికార్డులు, చట్టబద్ధమైన పాస్‌పుస్తకాలు అందేలా రెవెన్యూ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జొన్నలగడ్డ రెవెన్యూ గ్రామం పరిధిలో 1233 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లపాటి రాము, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు బండారుపల్లి విశ్వేశ్వరరావు, పులిమి వెంకట రామిరెడ్డి, కూటమి నాయకులు ఏరువ సాంబశివా రెడ్డి, ఏరువ కోటేశ్వరరెడ్డి, షేక్. మన్నన్ షరీఫ్, షేక్. రఫీ, గ్రామ పెద్దలు, రెవెన్యూ సిబ్బంది, రైతులు, కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదాల నివారణపై కరపత్రాల ఆవిష్కరణ

నరసరావుపేట క్రైమ్, జనవరి 6 ప్రమాద వార్త : :జాతీయ రహదారి భద్రత మాసోత్స వాలను పురస్కరించుకొని మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కృత్రికా శుక్లా, జిల్లా పోలీస్ అధికారి బి. కృష్ణారావుతో కలిసి రోడ్డు ప్రమాదాల నివారణ ప్రచార సామాగ్రిని ఆవిష్కరించారు. జిల్లా




రహదారి కమిటీ సభ్యులు, రోడ్డు సేఫ్టీ ఎన్జీవో ప్రెసిడెంట్ ఆర్. కనకదుర్గ పద్మజ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రజల్లో అవగాహన కల్పించడానికి తయారుచేసిన కరపత్రాలు, పోస్టర్లు, ఆడియోలను విడుదల చేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా రహదారి భద్రత కమిటీ మెంబర్ సెక్రటరీ మరియు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రోడ్లు భవనాల శాఖ గీతారాణి, జిల్లా రవాణా శాఖ అధికారి సంజీవ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద 164వ జయంతి ఉత్సవాలు

మాచర్ల, జనవరి 6 ప్రభాతవార్త: స్వామి వివేకానంద 164వ జయంతి ఉత్సవాల సందర్భంగా రామకృష్ణ మఠం రాజమండ్రి వారి ఆధ్వర్యంలో స్థానిక రామకృష్ణ సేవాసమితి సౌజన్యంతో పట్టణంలో పలు కళాశాలలు, పాఠశాలల్లో జాగృతి కాంపిటీషన్స్ నిర్వహించినట్లు సేవాసమితి అధ్యక్షులు మెట్టు



గోవిందరెడ్డి తెలిపారు. మంగళ వారం ఎస్‌కేబీఆర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమ తులు అందజేశారు. ముఖ్యఅతి థులుగా ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జె.లక్ష్మకుమారి హాజర య్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచే నైతిక, ఆధ్యాత్మిక విలువలు పెంచేందుకు జాగృతి పోటీలు నిర్వహించడం ఆనంద దాయకమన్నారు. స్వామి వివేకానంద జీవితం, సందేశం పుస్తకం జాగృతి పోటీలు నిర్వహించినట్లు మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల హిందీ లెక్చరర్ శ్రీనివాస్, సేవా సమితి సభ్యులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతు కష్టాన్ని దోచుకున్న దొంగ పులివెందుల ఎమ్మెల్యే: ఎమ్మెల్యే జూలకంటి

మాచర్ల, జనవరి 6 ప్రభాతవార్త: రైతు కష్టాన్ని దోచుకున్న దొంగ పులివెందుల ఎమ్మెల్యే జగన్‌రెడ్డి అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. మంగళవారం మండల పరిధిలోని పశర్లపాడు గ్రామంలోని రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని రైతులకు పాసు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో రైతులను అన్ని విధాలుగా మోసం



చేసిందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ పేరుతో జగన్‌రెడ్డి లక్షల ఎకరాల రైతుల భూములను కొట్టేయాలని కుట్ర పన్నారని చెప్పారు. ఏడాదినర కూటమి పాలనలో ల్యాండ్ గ్రాబింగ్ యాక్టు తీసుకొచ్చి భూ సమస్యలపై క్షేత్రస్థాయిలో చెక్ పెట్టేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని వివరించారు. విత్తనం నుంచి పంట గిట్టుబాటు ధర వరకు రైతుకు ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నిత్యం సమీక్షలు జరిపి, రైతును రాజును చేసేందుకు కూటమి ప్రభుత్వం శ్రమిస్తుందన్నారు.

### యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు

యూరియా కృత్రిమ కొరతను సృష్టిస్తే ఎవర్నీ ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే జూలకంటి హెచ్చరించారు. మండలాల వారీగా మార్క్ ఫెడ్, మార్కెట్ యార్డులు, రైతు సేవా కేంద్రాలు, గ్రోమోరు కేంద్రాల్లో యూరియా, ఇతర ఎరువులు పుష్కలంగా ఉన్నాయన్నారు. యూరియా అధిక ధర అమ్మినా, నల్లబజారులకు తరలించినా వ్యవసాయ శాఖ అధికారులు బాధ్యత వహించాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 30 నుంచి 40 శాతం అధిక మొత్తంలో నియోజకవర్గానికి ఎరువులను ప్రభుత్వం కేటాయించిందని వెల్లడించారు. కార్యక్రమంలో గురజాల ఆర్డీవో మురళి, తహశీల్దారు మేరీకనకం, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమగ్ర సంస్కరణలతో వ్యవసాయాభివృద్ధి: ఎమ్మెల్యే

మాచర్ల, జనవరి 6 ప్రభాతవార్త: సమగ్ర సంస్కరణలతో వ్యవసాయాభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జమ్మలమడక గ్రామంలో నిర్వహించిన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నూతనంగా ప్రింట్ చేసిన పట్టాదారు పాసు పుస్తకాలను రైతులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజముద్రలో ఉన్న రాజసం దోపిడీదారైన జగన్‌రెడ్డికి ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. ఐదేళ్ల పాలనలో ప్రచారం పిచ్చితో పొలం గట్ల సర్వే రాళ్లపై తన ఫొటో



వేసుకుని, రైతుల భూములను తాకట్టు పెట్టాలని చూశారని ఆరోపించారు. ల్యాండ్ గ్రాబింగ్ యాక్టుతో భూములపై ప్రజలకు పూర్తిస్థాయిలో హక్కులు కల్పించేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు.

### గోకుల షెడ్ల నిర్మాణంలో జమ్మలమడక ఆదర్శం

గోకుల షెడ్ల నిర్మాణంలో నియోజయవర్గ స్థాయిలో జమ్మలమడక ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే జూలకంటి రైతులను అభినందించారు. రూ.11.50 లక్షలతో నిర్మించిన ఐదు గోకుల షెడ్లను ఒకేరోజు ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం పశుగ్రాసం సాగుకు కూడా నిధులు కేటాయిస్తుందని, ఈ అవకాశాన్ని పాడి పరిశ్రమ రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు కిరణ్‌కుమార్, ఎంపీడీఓ ఫణికుమార్ నాయక్, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమాజసేవలో రోటరీక్లబ్ కీలకపాత్ర: రోటరీ గవర్నర్ రాంప్రసాద్

మాచర్ల, జనవరి 6 ప్రభాతవార్త: సమాజసేవలో రోటరీక్లబ్ కీలకపాత్ర పోషిస్తుందని, స్వార్థం కన్నా సేవే మిన్న అనే ప్రధాన లక్ష్యంతో ప్రపంచ వ్యాప్తంగా మెరుగైన సమాజ నిర్మాణంలో రోటరీక్లబ్ కీలకపాత్ర వహిస్తుందని రోటరీక్లబ్ గవర్నర్ డా॥ ఎస్.వి.రాంప్రసాద్ అన్నారు. మంగళవారం మాచర్లలో పర్యటించచిన రాంప్రసాద్ స్థానిక వైభవ్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత 40 ఏళ్లలో రూ.25 వేల కోట్లు ఖర్చు చేసి రెండు దేశాలు మినహాయించి పోలియో మహమ్మారిని ధరిత్రి నుంచి పూర్తిగా తొలగించి, పోలియో రాకుండా ప్రయత్నిస్తున్న అంతర్జాతీయ సంస్థ రోటరీక్లబ్ అని చెప్పారు. 32 వేలకుపైగా క్లబ్బులు, సుమారు 1.2 మిలియన్ సభ్యుల్ని కలిగి ప్రపంచవ్యాప్తంగా ప్రతీ గంటకు ఒక సేవా కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. మౌలిక సదుపాయాల కల్పన, పేదలకు జీవనోపాధి, మహిళల స్వావలంబనకు చేయూతనివ్వడం, పర్యావరణ పరిరక్షణకు చెట్లు నాటడం, విద్యార్థినులకు సైకిళ్లు అందజేత వంటి సమాజసేవలు అందస్తున్నామన్నారు. చేతులు, కాళ్లు లేని వికలాంగులకు మంగళగిరి రోటరీక్లబ్ వారి ఆధ్వర్యంలో కృత్రిమ కాళ్లు, చేతులు అమరుస్తున్నట్లు పేర్కొన్నారు. పేదలకు విద్య, వైద్యానికి తమ వంతు సహాయం చేస్తున్నట్లు చెప్పారు. సమాజ సేవకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని, పట్టణ సీఐ వెంకటరమణ, కమిషనర్ వేణుబాబుతోపాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించిన వారిని ఘనంగా సన్మానించారు. నూతన




సభ్యులను క్లబ్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ మాచర్ల అధ్యక్ష కార్యదర్శులు తుమ్మల సత్యప్రసాద్, ఆలేటి కోటేశ్వరరావు, కోశాధికారి యనమదల వెంకట్రామయ్య, అసిస్టెంట్ గవర్నర్ జుజ్జూరి మురళి, ప్రోగ్రాం కన్వీనరు పఠాన్ నాగూర్‌వలి, సీనియర్ రొటేరియన్లు డాక్టర్ కొండవీటి రామకోటయ్య, కాళంగి నాగేశ్వరరావు, గోనుగుంట్ల రామ్మూర్తి, మురహరిరావు, దశరథ్, నరసింహారావు, శంకర్, సిద్ధంరాజు, నాగార్జునరెడ్డి, శంకరరావు, సురేఖ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

